నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, మంగళవారం 12 నవంబర్ 2024 | SIDDIPET

రైతు నిరసన దీక్ష విజయవంతంపై అభినందనల వెల్లువ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్,నవంబర్11: నర్సాపూర్ నియోజకవర్గం కొల్చారం మండల కేంద్రంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించిన రైతు నిరసనదీక్ష విజయవంతమైనందుకు మాజీ మంత్రి కేటీఆర్ బీఆర్ఎస్ శ్రేణులను అభినందించారని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వెల్లడించారు. సోమవారం ఆమె గచ్చిబౌలిలోని మాజీ మంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో,తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నర్సాపూర్ నియోజకవర్గ నాయకులు దుర్గారెడ్డి, సత్యంగౌడ్, ప్రసాద్, షేక్‌హుస్సేన్, ఎల్లమయ్య, ప్రవీణ్, నరహరి, కాంతారావు, రాజు, నవీన్, శేఖర్, పోచయ్య, చక్రి, లక్ష్మణ్, ప్రభు ఉన్నారు.



మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

జవాబుదారీగా అధికారులు పనిచేయాలి

మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ) : జవాబుదారీగా అధికారులు పనిచేయాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్ సూచించారు. మెదక్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజల నుంచి ఆయన 65 దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రానున్న ప్రజావాణిలో ఏఏ శాఖ వద్ద ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయో తెలుపాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ధరణి 17, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు 4 , ఇతర సమస్యలపై 44 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్

పేరు మార్చి సర్వే చేపట్టడం విడ్డూరం



దుబ్బాక మండలం పోతారంలోని ఇంట్లో సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చిన అధికారులు, ఉపాధ్యాయులకు వివరాలు చెబుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- కొత్త సీసాలో పాత సారా మాదిరిగా కాంగ్రెస్ సమగ్ర కుటుంబ సర్వే
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక,నవంబర్11: బీఆర్ఎస్ సర్కారులో సమగ్ర కుటుంబ సర్వే చేపడితే విమర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు పేరు మార్చి తిరిగి అదే సర్వే చేపట్టడం విడ్డూరంగా ఉందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కొత్త సీసాలో పాతసారా మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఉందని మండిపడ్డారు. సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పోతారంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తమ ఇంట్లో సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చిన అధికారులు, ఉపాధ్యాయులకు వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత కేసీఆర్ సర్కారులో సమగ్ర కుటుంబ సర్వే చేపడితే ..రేవంత్‌రెడ్డి ఎన్నో రకలుగా విమర్శలు చేశారని, దానికి సంబంధించిన నాటి రేవంత్‌రెడ్డి వీడియో క్లిపింగులను విలేకరుల ముందు చూపించారు. గొర్రెలు, బర్రెల వివరాలు ఎందుకు అని ప్రశ్నించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మళ్లీ ఎందుకు సర్వే చేయిస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా, సర్వే పేరుతో మరోసారి కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. రిజర్వేషన్లు అంటూ కాంగ్రెస్ సర్కారు బీసీ,ఎస్సీల్లో కుల చిచ్చుపెడుతుందని మండిపడ్డారు. బీసీ,ఎస్సీలపై చిత్తశుద్ధి ఉంటే సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ చేపడుతున్న కుటుంబ సమగ్ర సర్వేతో ప్రజలకు ఇబ్బందులు తప్పా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 60 మంది బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. అనంతరం దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలకు ఆయన హాజరై వారిని ఆశీర్వదించారు. దుబ్బాక 12వ వార్డు కౌన్సిలర్ బట్టు ఎల్లం తండ్రి బాలమల్లు దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు కిషన్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, నారాగౌడ్, కౌన్సిలర్లు ఆస యాదగిరి, ఆస స్వామి, ఇల్లేందుల శ్రీనివాస్, దేవుని లలిత, లచ్చయ్య పాల్గొన్నారు.

అవే ప్రశ్నలు...విన్నపాలు

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని బుడిగజంగాల కాలనీలో సర్వేచేస్తున్న ఎన్యూమరేటర్లు

- కులగణన సర్వేతో మాకేం వస్తాయి
- సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని బుడిగజంగాల కాలనీలో పరిస్థితి
- తలలు పట్టుకుంటున్న ఎన్యూమరేటర్లు

హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 11: సర్వే ఎందుకు సార్ చేస్తున్నారు.... దీంతో మాకు ఏమైస్తదంటూ ప్రజలు ఎన్యూమరేటర్లకు ప్రశ్నలు వేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే ఎన్యూమరేటర్లకు ప్రజల నుంచి ఎదురవుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక ఇబ్బందులు పడటంతోపాటు సమాచార సేకరణ కోసం ఒక కుటుంబానికి గంటకుపైగా సమయం తీసుకోవడంతో ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల ఒక్కరే సర్వే చేయలేక సహాయకులను నియమించుకుని సర్వే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సర్వేకు సంబధించిన పుస్తకాలు ఆలస్యంగా రావడంతో సర్వే సమాచారాన్ని పుస్తకాలు చూసి సమాధానాలు రాయాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్వే ఎందుకు సార్...

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో సోమవారం కొనసాగిన కులగణన సర్వేలో ప్రజలు పలు సందేహాలు వ్యక్తం చేశారు. పథకాలు ఇవ్వడానికి రాలేదని, మీ సమాచారాన్ని ప్రభుత్వం అడుగుతున్నదని రావడం జరిగిందని అధికారులు వివరించారు. సర్వేతో ఏమి లాభం చెప్పండి సార్ అంటూ ప్రజలు అనడంతో మాకు తెలియదని అధికారులు సమాధానాలు చెప్పాల్సిన పరిస్థితులు క్షేత్రస్థాయిలో కనిపించాయి. రేషన్‌కార్డులు లేవని, ఇందిరమ్మ ఇండ్లు రా లేదని, పింఛన్ పెరగలేదని, గ్యాస్ డబ్బులు పడటం లేదంటూ పలువురు ఎన్యూమరేటర్లకు వివరించారు. గిన్ని ప్రశ్నలు మాకేందుకు సార్లు... ఏదో మా దగ్గర ఏముంటుందంటూ బుడిగజంగాల కాలనీలోని ప్రజలు సర్వేసార్లకు చెప్పారు. మీదగ్గర ఉన్నవే చెప్పండి అంటూ ఒకింత వేడుకోలుగా వారు సర్వేనిర్వహించాల్సి వస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం సమగ్రకుటుంబ సర్వేనిర్వహించిన క్రమంలోఇంటిల్లిపాది కలిసి సర్వేకు సహకరించగా ప్రస్తుతం సర్వేకు వస్తున్న అధికారులకు ఏదో చెప్పాలి కదా అనేరీతిలో సమాచారం ఇస్తున్న పరిస్థితులు కనిస్తున్నాయి.

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం లెనిన్‌నగర్‌లోని జిన్నింగ్ మిల్లుకు పత్తి తీసుకువచ్చిన రైతులు

పత్తి కొనుగోళ్లు బంద్

ఉమ్మడి మెదక్ జిల్లాలో 46 జిన్నింగ్ మిల్లులు

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం గురజాకుంట గ్రామంలో బంద్‌చేసిన జిన్నింగ్ మిల్లు

- సీసీఐ నిబంధనలు కఠినతరం
- ఎల్1, ఎల్2, ఎల్3 అనే కొత్త నిబంధన
- సడలించాలంటున్న జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు
- తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతులు
- ఫలితంగా వ్యాపారుల పంట పండుతోంది

సిద్దిపేట, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. సీసీఐ పెట్టిన నిబంధనలతో తాము కొనలేమని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు పత్తి కొనుగోళ్లు నిలిపివేశాయి. ఈ ఏడాది ఎల్1, ఎల్2, ఎల్3 అనే కొత్త నిబంధన తీసుకువచ్చిందని జిన్నింగ్ మిల్లుల వ్యాపారులు చెబుతున్నారు. సీసీఐ పెట్టిన నిబంధనలను తక్షణమే సడలించాని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో అన్నదాతలకు తిప్పలు తప్పడం లేదు. దీనిని అదునుగా చేసుకొని కొంత మంది ప్రైవేట్ వ్యాపారులు రైతుల వద్ద మద్దతు ధరకు తక్కువగా పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో వ్యవసాయ మార్కెట్ల వారీగా సీసీఐ 46 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసింది. సిద్దిపేట జిల్లాలో 24, సంగారెడ్డి జిల్లాలో 20, మెదక్ జిల్లాలో 2 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. వీటి ద్వారా పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు.



సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం మేళసంగం గ్రామశివారులో పత్తికొనుగోలు చేయం అని బోర్డు ఏర్పాటు చేసిన మంగళ్‌మూర్తికాటన్స్ పత్తిమిల్లు యాజమాన్యం

ఉమ్మడి మెదక్ జిల్లాలో 46 జిన్నింగ్ మిల్లులు

సిద్దిపేట జిల్లాలో 3.35 లక్షల ఎకరాలు, మెదక్ జిల్లాలో 36 వేల ఎకరాలు, సంగారెడ్డి జిల్లాలో 1.04 లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. సిద్దిపేటలో 24, సంగారెడ్డి జిల్లాలో 20, మెదక్‌లో 2 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి.సిద్దిపేట జిల్లాలో 15 లక్షల క్వింటాళ్లు, సంగారెడ్డి జిల్లాలో 12 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. .పత్తి పొడవు రకం రూ. 7,521, మధ్య రకం రూ. 7,121 మద్దతు ధరతో సీసీపీ కొనుగోళ్లు ప్రారంభించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీసీఐ రెండు విధాలుగా పత్తి కొనుగోళ్లు చేయవచ్చు. ఇందులో ఒకటోది బహిరంగ మార్కెట్‌లో మద్ద తు ధర కంటే తక్కువ ధరతో వ్యాపారులు కొనుగోలు చేస్తుంటే సీసీఐ రంగంలోకి దిగి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేస్తూ పత్తి రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత సీసీఐపై ఉంటుంది. ఇక రెండోది ప్రైవేట్ వ్యాపారులతో పోటీపడి పత్తిని కొనుగోలు చేయడం, వ్యాపారులు ఒక్కటైతే సీసీఐ వల్ల రైతులకు న్యాయం జరుగుతుంది. కానీ సంస్థ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఉన్న సీసీఐ కేంద్రాలను మూసివేసే పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. కేంద్రం పత్తికి మద్దతు ధర రూ. 7,521 నిర్ణయించింది. ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారులు కుమ్మక్కై పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ పోటీ లేక పోతే రైతులు తీవ్రంగా నష్టపోతారు.పత్తి నాణ్యత, తేమ శాతం పేరిట రైతులకు నష్టం జరుగనున్నది. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలోని పత్తి వ్యాపారులు అంతా సిండికేట్ అయ్యారు. అటు అధికారులు, ఇటు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులకు నష్టం జరుగుతుంది. పత్తి వ్యాపారులతో స్థానిక అధికారులు, కొంత మంది నేతలు కుమ్మక్కు అయినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వ్యాపారుల పంట పండుతోంది..

పత్తి రైతులకు తేమ నిబంధన శాపంగా మారుతుంది. సీజన్ ఆరంభంలోనే పత్తి కొనుగోలుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిబంధనల ప్రకారం పత్తిలో 8 శాతం నుంచి 12 శాతం మధ్య తేమ ఉంటే మద్దతు ధర ఇవ్వాలి. గతంలో 16శాతం వరకు తేమ ఉన్నా పత్తి కొనుగోళ్లు జరిపారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని పత్తి రైతులు వాపోతున్నారు. సీసీఐ తేమ నిబంధనల పేరుతో రిజెక్టు చేసిన పత్తిని రైతుల నుంచి ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులను నిలువునా వ్యాపారులు దోచుకుంటున్నారు. పత్తిపై ఆశలు పెట్టుకున్న రైతుల ఆశలు నిరుగారుతున్నాయి. ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అటు సీసీఐ పెట్టే నిబంధనలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

సీసీఐ నిబంధనలు కఠినతరం

ప్రస్తుతం సీసీఐ పెట్టిన నిబంధనలను కఠినతరం చేయడంతో కొనుగోలు ప్రక్రియలో సమస్య ఏర్పడింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ముందుగా నోటిఫై చేసుకున్న ఒక మిల్లులో పత్తిని ఖరీదు చేసి జిన్నింగ్ చేపట్టి బేళ్లు తయారు చేస్తారు. ఆమిల్లులో తయారీ సామర్థ్యం పూర్తయ్యాక నోటిఫై చేసుకున్న మరో జిన్నింగ్ మిల్లులో పత్తి ఖరీదు, జిన్నింగ్ ప్రక్రియను చేపడుతారు. ఇలా కొనుగోలు ప్రక్రియ చేపడుతారు.దీంతో మిగతా మిల్లుల్లో పత్తి కొనుగోలు చేసే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. సీసీఐ నిబంధనలతో రైతులకు ఆదిలోనే ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పత్తి కొనుగోలుకు సీసీఐ జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసుకున్నా..తాజాగా విధించిన నిబంధన ప్రకారం మొదటి, రెండు, మూడో నిబంధనలతో రైతులు, పత్తి కొనుగోలుదారులు ఇబ్బందులు పడే ఆస్కారం ఏర్పడింది. రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు సీసీఐ నిబంధనల ప్రకారం ఒక క్వింటాల్‌కు 35కిలోల దూది, 65 కిలోల వరకు గింజలను వేరు చేసి ఇస్తారు. దూదిని బేళ్లుగా తయారు చేసి ఇచ్చినందుకు సీసీఐ జిన్నింగ్ చార్జి పేరిట మిల్లుల యాజమాన్యాలకు ఇస్తుంది. పొలాల నుంచి సేకరించిన పత్తిని సీసీఐ కేంద్రాల్లో విక్రయించేందుకు వెళ్లే రైతులు జిన్నింగ్ మిల్లుల గేట్లవద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది. రాత్రి సమయంలో అక్కడే నిద్రపోయి తమవంతు కోసం ఎదురు చూస్తున్నారు.

సుడా ప్లాట్లు వేలం వేయొద్దు

- అసలైన లబ్ధిదారులకు పరిహారం అందలేదు
- సుడా కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన భూ బాధితులు

సుడా కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మిట్టపల్లి భూ బాధితులు

సిద్దిపేట అర్బన్, నవంబర్ 11: సుడా వెంచర్ కోసం తమ భూములను బలవంతంగా తీసుకున్నారని, ఆ వెంచర్‌లో ప్లాట్లు కొంటే భవిష్యత్‌లో తమ నుంచి కోర్టు కేసులు ఎదుర్కోవాల్సి వస్తదని సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి సుడా వెంచర్‌కు సంబంధించిన భూ బాధితులు హెచ్చరించారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని సుడా కార్యాలయం ఎదుట మిట్టపల్లి భూ బాధితులు నిరసన వ్యక్తం చేశారు. వేలంపాట నిర్వహించే హాల్‌లోకి బాధితులు దూసుకువెళ్లగా పోలీసులు అడ్డుకొని బయటకు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు నష్టపరిహారం చెల్లించకుండానే తమ భూములను సుడా ప్లాట్లుగా వేలం వేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇందిరాగాంధీ ప్రభుత్వంలో తమ తాతలకు భూములను కేటాయిస్తే తాము వ్యవసాయం చేసుకుంటున్నామని, కానీ ఆ భూముల్లో సుడా వెంచర్ వేశారని బాధితులు తెలిపారు. సుడా వెంచర్‌లో తాము భూములు కోల్పోతే అసలైన లబ్ధిదారులకు నష్టపరిహారం ఇవ్వకుండా ఇతర వ్యక్తులకు ఇచ్చారని బాధితులు ఆరోపించారు. రెవెన్యూ అధికారులు భూమి మ్యుటేషన్ చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరించారన్నారు. కోర్టులో ఉన్న భూములను వేలం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని భూ బాధితులు తెలిపారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

సంగారెడ్డి కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్వో పద్మజారాణి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 11: ధరణిలో సొంత భూమి మరొకరి పేరున చూపిస్తున్నదని, వెంటనే తన పేరున పట్టా పాసు పుస్తకం జారీ చేయాలని కోరుతూ అందోల్ మండలం మన్సాన్‌పల్లికి చెందిన పి లచ్చమ్మ అదనపు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నది. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారులకు అందజేశారు. ప్రజావాణిలో మొత్తం 39 అర్జీలు అందాయి. సంగారెడ్డికి చెందిన పలువురు చిన్నారులు అధికారులకు అర్జీ అందజేస్తూ ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలో భాగంగా స్విమ్మింగ్‌లో మూడో స్థానం సాధించామని తెలిపారు. అయితే కోచ్ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వెంటనే సంగారెడ్డికి ఒక స్విమ్మింగ్ పూల్‌తో పాటు కోచ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ మాధురి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి, ఏవో పరమేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్‌లో హైడ్రా హల్‌చల్

- మరోసారి జేసీబీలతో దర్శనం
- కూల్చిన వ్యర్థాలు తీసివేస్తామన్న హైడ్రా
- బాధితుల ఆందోళనతో వెనుదిరిగిన అధికారులు

అమీన్‌పూర్, నవంబర్ 11 : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడలోని బీఎస్ఆర్‌కాలనీ సర్వేనంబర్ 12లో గత సెప్టెంబర్‌లో స్థానిక రెవెన్యూ హైడ్రా అధికారుల ఆధ్వర్యంలో 26 ఇండ్లను కూల్చి వేశారు. ఇండ్ల నిర్మాణాల వ్యర్థాలను సోమవారం హైడ్రా అధికారులు తరలించేందుకు జేసీబీలతో వచ్చి హల్‌చల్ చేశారు. కూల్చిన ఇండ్ల వివాదం న్యాయస్థానంలో కొనసాగుతున్నదని, దీనిపై స్టేటస్కో సైతం ఉందని బాధితులు ఆందోళనకు దిగారు. బాధితుల తరపున న్యాయవాది హైడ్రా అధికారులతో మాట్లాడటంతో అక్కడి నుంచి వారు వెనుతిరిగారు.

అమీన్‌పూర్ బీఎస్ఆర్ కాలనీలో హల్‌చల్ చేస్తున్న హైడ్రా అధికారులు

హైడ్రా వాహనాలతో అమీన్‌పూర్ బీఎస్ఆర్ కాలనీకి వచ్చిన అధికారులు, సిబ్బంది

లారీల కొరతతో ఎక్కడి ధాన్యం అక్కడే

మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం బండపోతుగల్‌లో నాలుగు రోజుల నుంచి లారీలు రాకపోవడంతో నిలిచినపోయిన ధాన్యం బస్తాలు, నిరసన తెలుపుతున్న రైతులు

చిలిపిచెడ్, నవంబర్ 11: ధాన్యం కొనుగోళ్లలో అధికారులు జాప్యం చేయడం వల్ల రైతులకు శాపంగా మారిందని రైతు బంధు సమితి సమన్వయ కమిటీ మాజీ సభ్యుడు సయ్యద్ హుస్సేన్ అన్నారు. మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని బండపోతుగల్, ఫైజాబాద్, అజ్జమర్రి గ్రామాల్లో ధాన్యం బస్తాలు కాంటావేసి నాలుగు రోజులు గడుస్తున్నా లారీలు రాక ఎక్కడి ధాన్యం అక్కడే నిలిచిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పీఏసీఎస్ సీఈవో పోచయ్యను రైతులు అడ్డుకొని నిరసన వ్యక్తం చేసి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అదనపు కలెక్టర్‌కు లారీల కొరత లేకుండా చూసి ధాన్యాన్ని త్వరగా తరలించాలని వినతి పత్రం అందజేశారు. రైస్‌మిల్లుకు పోయిన లారీలను కూడా త్వరగా ఖాళీ చేయించి కేంద్రాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో బండపోతుగల్, ఫైజాబాద్, అజ్జమర్రి గ్రామాలకు చెందిన రైతులు నర్సింహారెడ్డి, గోపాల్‌రావు, బాల్‌రాజ్ పాల్గొన్నారు

పంటను కొనుగోలు చేయని ప్రభుత్వం

శివ్వంపేట, నవంబర్ 11 : ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల ఐకేపీ కేంద్రంలో రైతులు మాట్లాడారు. కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన సన్నధాన్యాన్ని తూకం వేయడం లేదన్నారు. ప్రభుత్వం మీద నమ్మకం లేక ఇప్పటికే 25శాతం మంది సన్నరకం ధాన్యాన్ని దళారులకు అమ్ముకున్నారని తెలిపారు. సన్నవడ్లు ఎందుకు కొనుగోలు చేయడం లేదని అధికారులను నిలదీస్తే ధాన్యానికి సైజులు, కొలతలు అని పొంతన లేని సమాధానం చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బోనస్ ఇవ్వాలని, లేకుంటే తగిన బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు

అధికారులు చొరవ చూపాలి

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్11: అధికారులు ప్రత్యేక చొరవ చూపి ప్రజావాణిలో వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. సోమవారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి అనేది గొప్ప కార్యక్రమమని చెప్పారు. సామాన్యులకు అధికారులు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. భూ సంబంధిత, ఇండ్లు, ఆసరా పింఛన్లపై 77 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్‌వో నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆలయం ఆధ్వర్యంలో టెంకాయల విక్రయం

ఎల్లమ్మ ఆలయ వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్

చేర్యాల, నవంబర్ 11 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద ఇష్టారాజ్యంగా టెంకాయల విక్రయం పై ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో కథనం రావడంతో ఆలయ అధికారులు స్పందించారు. ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయానికి నిర్వహించిన టెండర్లలో తక్కువ పాట వచ్చింది. ఆలయ అధికారులు మరోసారి టెండరు నిర్వహించినప్పటికీ అనుకున్న స్థాయిలో ఆదాయం రాలేదు. టెండరు ఖరారు కానప్పటికీ తక్కువ ధరకు పాటపాడిన వ్యక్తులు మల్లన్న ఆలయానికి ఉపదేవాలయం ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో నమస్తే తెలంగాణలో కథనం రావడంతో స్పందించిన ఆలయ ఈవో బాలాజీ సోమవారం మల్లన్న ఆలయం నుంచి ప్రత్యేకంగా ఓ వ్యక్తిని నియమించి భక్తులకు టెంకాయలను విక్రయించే విధంగా చర్యలు తీసుకున్నారు. టెండరు ఖరారు కాకపోవడంతో ఇక నుంచి ఎల్లమ్మ ఆలయం వద్ద ఎవరూ కొబ్బరికాయలు విక్రయించవద్దని ఆదేశాలు జారీ చేశారు. మల్లన్న ఆలయం రాజగోపురం వద్ద కొబ్బరికాయలు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఎల్లమ్మ ఆలయం వద్ద తక్కువ ధరకు టెంకాయిలు అమ్ముతున్నారని తెలిసిన కొందరు భక్తులు అక్కడికి వెళ్లి తమకు అవసరమైన కొబ్బరికాయలు కొనుగోలు చేయడం కోసమెరుపు.